# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## మోకాళ్లపై కూర్చుని దేశం నేతల నిరసన

వి.కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను ఖండిస్తూ వి.కోటలో తెదేపా శ్రేణులు బుధవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ మాట్లాడుతూ మాటతప్పను, మడమ తిప్పను అని అధికారంలో వచ్చిన సిఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అంధకారం చేశారన్నారు. అభివృద్ధి అటకెక్కిందన్నారు. తెదేపా అధినేత చంద్రబాబుకు లభిస్తున్న జనాదరణ తట్టుకోలేక స్కిల్ స్కాం పేరిట అక్రమంగా అరెస్ట్ చేయించారని విమర్శించారు. ప్రజలు వైకాపాకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో దేశం శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్వర్టును ఢీకొన్న ఐచర్ .. డ్రైవర్ మృతి

చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:



మొక్కలు లోడ్‌తో బెంగుళూరు నుండి విజయవాడకు వస్తున్న ఐచర్ వాహనం పనపాకం వద్ద కల్వర్టును ఢీకొట్టిన ఘటన బుధవారం వేకువజామున చోటుచేసుకున్నది. వివరాల్లోకెళితే.. బెంగుళూరు నుండి విజయవాడకు మొక్కలను తరలిస్తున్న వాహనం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం వద్ద అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో డ్రైవర్ సుదర్శన్ (27) మృతి చెందాడు. క్లీనర్‌గా వచ్చిన యజమాని అబ్బయ్యకు గాయాలు కావడంతో 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. మృతుడు కృష్ణ జిల్లా, గూడూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### అన్నదాతకు వెన్నుదన్నుగా

## రైతు భరోసా కేంద్రాలు

### మంత్రి రోజా



ఓజీ కుప్పంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నగరి, అక్టోబరు 11 ప్రభాతవార్త:

అన్నదాతకు వెన్నుదన్నుగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని మంత్రి రోజా అన్నారు. బుధవారం మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తునుంచి విక్రయం వరకు ఒకే చోట అందించాలన్నదే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వంఏర్పాటు చేస్తుందన్నారు. అన్నదాతలకు అండగా నిలవడానికే ముఖ్యమంత్రి వీటిని ఏర్పాటు చేస్తున్నారని, గ్రామాల్లో రైతులకు పలు మార్పులు నేడు కనిపిస్తోందన్నారు. సమాచారంతో పాటు అన్ని వ్యవసాయ పనులకు రైతు భరోసా కేంద్రాలు కేంద్ర బిందువుగా మారిందన్నారు. రైతుకు కావలసిన సేవలన్ని చేరువయ్యాయన్నారు. బీమానుంచి పంట నమోదు వరకు రైతు భరోసా కేంద్రాల్లో జరుగుతోందన్నారు. హార్టికల్చర్‌తో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. సీడ్ బుకింగ్ జరుగుతుందన్నారు. గతంలోలా విత్తనాల కోసం పడగాపులు, ఎరువుల కోసం ఆందోళనలు ఇప్పుడు లేవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, కో-ఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఎంపీడీవో లీలామాధవి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్‌లు మోహన్, రవికుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వేతనం కోసం ఎదురుచూపు

### ఉద్యమానికి సిద్ధమవుతున్న ఉద్యోగులు

SAMAGRA SHIKSHA ABHIYAN

కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు అందక అవస్థలు తప్పడం లేదు. విద్యాశాఖలో వివిధ విభాగాల్లో వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మూడు నెలల జీతాలు రావాల్సి ఉంది. ఇందులో బోధన సిబ్బంది, ఒప్పంద, బోధనేతరాల పొరుగు సేవలతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా ఫలితం అంతంతమాత్రమే. అదీ సమయానికి అందదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫేషియల్ యాప్‌లతో నిమిషం ఆలస్యమైతే గైర్హాజరుగా పరిగణిస్తున్నారు. దీంతో ఉరుకులు పరుగులతో ఉద్యోగాలు చేస్తున్నా నెలల తరబడి జీతాలివ్వకపోవడంతో కుటుంబ పోషణ దుర్భరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు పుట్టక, కుటుంబాలు గడవక క్షోభ అనుభవిస్తున్నామని మదనపడుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సమగ్ర శిక్షా సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, పొరుగు సేవల సిబ్బందిని ఒప్పంద పద్ధతిలో తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఆర్‌సి మేరకు సమగ్ర శిక్షా కెజిబివి ఒప్పందం పొరుగు సేవల సిబ్బందికి ఎంపిఎస్‌బివి హెచ్‌ఆర్‌ఎల అమలుతో వేతనం పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో సుమారు 4 వేలమంది పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు వారు తెలిపారు.

## మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేయాలి

వడమాలపేట, అక్టోబరు 11 ప్రభాతవార్త:



కాయం వద్ద జగనన్న కాలనీలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లాకలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని కాయం రెవెన్యూలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు, వీధులను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మింపచేయాలని చెప్పారు. తాగునీటిసౌకర్యం, వీధి లైట్లు, మురుగునీటి కాలువలు, రోడ్లు వంటిసదుపాయాలు కల్పించాలని తెలిపారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. పరిశీలనలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి, జిల్లా అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో భానుమూర్తి, ఏవో శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న

## ఇవిఎంల అక్సెప్టెన్స్ టెస్ట్

### ఎలక్షన్ గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ సగిలి షన్మోహన్



ఎలక్షన్ గోడౌన్‌లో ఇవిఎంల ఆక్సెప్టెన్స్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్.

చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

జిల్లా సచివాలయంలోని ఎలక్షన్ గోడౌన్లలో ఈ నెల 16వ తేదీ నుండి బెల్ ఇంజనీర్లు చేపట్టిన ఇవిఎంల అక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసిజర్‌ను బుధవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు రెండంచెల భద్రత నడుమ 12 మంది బెల్ ఇంజనీర్ల సమక్షంలో ఈ నెల 16వ తేదీ నుండి ఫస్ట్ లెవల్ చెకింగ్ జరుగుతున్నదని, జిల్లాకు కొత్తగా బెల్ కంపెనీ నుండి 2,510 బ్యాలెట్ యూనిట్లు, 3,617 వివిప్యాడ్స్, 4,390 కంట్రోల్ యూనిట్లకు అక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్‌ను చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో గతంలో వున్న పాత 2,353 బ్యాలెట్ యూనిట్లు, 1,448 కంట్రోల్ యూనిట్లు, 1,711 వివి పాడ్స్‌లను వీటిలో కలపనునున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్‌తో పాటు డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు, ఎన్నికల సూపరిటెండెంట్ బ్యూలా, ఎలక్షన్ సెలల్ సిబ్బంది ఉమాపతి, మనోజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

### కమిషనర్ హరిత





తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 11, ప్రభాతవార్త

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ పరిధిలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేకాధికారి రామచంద్ర రెడ్డి, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పాలక ఇంజనీర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు అయిన విద్యుత్, నీటి సరఫరా, రోడ్లు వంటివి కొంతమేర ఏర్పాటు చేసినా అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని అన్నారు. స్టేజిల వారీగా బిల్లుల మంజూరు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, నగర పాలక సంస్థ, గృహ నిర్మాణ శాఖ డిఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహార కిట్టులో పాము చర్మం కాదు.. రబ్బర్ ముక్క

### అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించిన ఐసిడిఎస్ పిడి నాగశైలజ

బంగారుపాళ్యం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:



వైఎస్ఆర్ పోషణ కిట్టులో పాము చర్మం అనే శీర్షికతో బుధవారం 'ప్రభాతవార్త'ను ప్రచురించింది. ఈ వార్తపై స్పందించిన జిల్లా ఐసిడిఎస్ పిడి నాగశైలజ బుధవారం శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో బాలితలు, గర్భవతులకు ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ పోషణ కిట్టులను అంగన్‌వాడీ కార్యకర్త అందజేశారు. గర్భవతి మానసకు ఈ పోషణ కిట్టును అందజేయగా ఆమె తీసుకొన్న పోషణ కిట్టులోని ఎండు ఖర్జురంలో పాము చర్మం వున్నట్లు గుర్తించి ఆందోళన చెందారు. ఈ విషయం 'ప్రభాతవార్త' ప్రచురించగా దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసిడిఎస్ పిడి నాగశైలజ అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించి గర్భవతి మానసను విచారించారు. గర్భవతి మానసకు ఇచ్చిన ఎండు ఖర్జురం పాకెట్లను పిడి పరిశీలించి అందులో వున్న పాము రూపంలో వున్న రబ్బరు ముక్కను గుర్తించారు. మృతి చెందిన పాము కళేబరం వున్నట్లైతే దుర్వాసన వచ్చేదని, ఈ ముక్క గట్టిగా రబ్బరు లాగా వున్నట్లు గుర్తించారు. అలాగే పోషక పదర్థాల ప్యాకింగ్‌లో కూడా ఎలాంటి తప్పిదాలు వుండవని వస్తువుల పంపిణీ దారులు పిడి దృష్టికి తీసుకువచ్చారు. ఇది కేవలం ప్లాస్టిక్ ముక్కగా అధికారులు నిర్ధారించారు.

## 21న షార్ నుంచి క్రూమాడ్యూల్ ప్రయోగం

### - గగన్‌యాన్ ముందస్తు పరీక్షలలో కీలక ఘట్టం

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 11 ప్రభాతవార్త





షార్ నుంచి ప్రయోగించనున్న క్రూమాడ్యూల్ పరికరం

శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ నెల 21న క్రూ మాడ్యూల్ ప్రయోగం జరపనున్నారు. ఇందుకు సంబంధిం చి ఇక్కడి మొదటి ప్రయోగ వేదిక వద్ద ఏర్పాట్లు చకచకా జరుగుతు న్నాయి. టెస్ట్ వెహికల్ డిపార్ట్‌మెంట్ ఫ్లైట్ (టివిడి1)గా ఈ ప్రయోగాన్ని పేర్కొం టున్నారు. గగన్‌యాన్ ముందస్తు పరీక్షలలో ఇది కీలక ఘట్టం కానుంది. భూమి నుంచి 11 కిలోమీటర్ల దూరం దాకా ఈ వాహక నౌక అంతరిక్ష యానం చేయనుంది. అనంతరం పారాచూట్లు విచ్చుకొని క్షేమంగా సముద్రంలో పడేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నావిగేషన్ వ్యవస్థల ద్వారా ఇవి పడిన ప్రదేశాలు గుర్తించి షిప్‌లలో వెళ్లి భూవాతావరణానికి తీసుకురావడం ఈ క్రూ మాడ్యూల్ ప్రధాన ఉద్దేశం. శ్రీహరికోట నుంచి చేపట్టనున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన మానవసహిత గగన్‌యాన్ ప్రయోగానికి ముందు ఇటువంటి పరీక్షలు అవసరమయ్యాయి. వ్యోమగాములను తిరిగి భద్రంగా తీసుకురావడానికి క్రూమాడ్యూల్ ఎస్కేప్ టెస్ట్ నిర్వహిస్తున్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



వడమాలపేట, అక్టోబరు 11 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోవెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేపట్టారు. పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి వేదపండితుల అర్చన, తోమాలసేవ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి ,భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం మూల విరాట్‌కు, ఉత్సవర్లకు శ్రీ పద్మావతి అమ్మవారికి, శ్రీ ఆండాళ్ అమ్మవారికి, జయ విజయులకు గరుడాళ్వార్‌కు, శ్రీ ఆంజనేయస్వామి వారికి ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణ బట్టర్ తిప్పయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమర్నాథ్ రెడ్డిచే ఇంటింటికి తెలుగుదేశం

### - మాజీమంత్రి అమర్‌కు అడుగడుగునా నీరాజనాలు.

పెద్దపంజాణి అక్టోబర్ 11 ప్రభాతవార్త :



మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి చేపడుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని బుధవారం పెద్దపంజాణి మండలంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శంకర్రాయలపేట, శివాడి, నిడిగుంట పంచాయతీలతోపాటు బొమ్మరాజుపల్లి పంచాయతీలోని కంగానంబండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అడుగడుగునా మాజీమంత్రి అమర్‌కు మహిళలు మంగళహారతులతో, అభిమానులు, యువకులు పూలవర్షం కురిపిస్తూ జేజేలు కొడుతూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ప్రతిఇంటికివెళ్ళి టిడిపిహయాంలో అమలుచేసిన సంక్షేమపథకాలు, అభివృద్ధిగురించి ప్రజలకు వివరించారు. అలాగే తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడును వైకాపా ప్రభుత్వం కక్షతోనే స్కిల్ డెవలప్మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేయించి జైలుపాలు చేసిందన్నారు. అనంతరం గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరో ఆరునెలల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలో రావడం ఖాయమన్నారు. గ్రామాల్లో పార్టీ పతాకా విష్కరణ చేసి ప్రజలకు కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా పలువురు వైకాపా నాయకులు మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. వైకాపా నాయకులు బాలాజి, హరినాథ్, ఈశ్వర్, విజయరామిరెడ్డిలతో పాటు వారి అనుచరులు. నిడిగుంట కాలనీకి చెందిన సుబ్రమణ్యంలు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి సమక్షంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనంద్, మండల టిడిపి కార్యదర్శి చలపతి, మాజీ ఎంపిపి మురళీకృష్ణ, నాగిరెడ్డి నేతలు శ్రీరాములు, భానుప్రతాప్ రెడ్డి, మురహరి రెడ్డి, జయరాం రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, ధనంజయ నాయడు, రుద్రమూర్తి నాయుడు, సుకుమార్, ఆంటోని, వేణుగోపాల్ నాయుడు, ముబారక్, సుబ్రమణ్యం, నాగరాజు యాదవ్‌లతో పాటు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ

### - సహాయ కార్మిక కమీషనర్

తిరుపతిరూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సహాయ కార్మిక కమీషనర్ తెలిపారు. ఉపాధి నిమిత్తం కర్ణాటక, ఒడిస్సా, బిహార్, తమిళనాడు, మహారాష్ట్ర తదితర జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు వచ్చిన వలస కార్మికులకు ఇ-శ్రమ్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, కార్మిక శాఖ పర్యవేక్షణలో అందించడం జరుగుతుందని తెలిపారు. శ్రామికుడు ప్రమాదశాత్తు చనిపోతే భీమా కింద రూ.2లక్షల సహాయం అందించబడుతుందని తెలిపారు. 16-59 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు అర్హులని తెలిపారు. ఇంకనూ అసంఘటిత వలస కార్మికులు, భవన, ఇతర నిర్మాణ కార్మికులు, తాపీ కూలీలు, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, పంబ్లింగ్, శానిటరీ, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీలు, కాంక్రీట్ మిక్సర్, చేనేత, కుమ్మరి, స్వర్ణకారులు, క్షౌరవృత్తి, బ్యూటీ పార్లల్‌లో పని చేసేవారు, చర్మకారులు, వీధి వ్యాపారస్తులు, తోపుడు బండి వ్యాపారస్తులు, చిరు వ్యాపారస్తులు, ఇండ్లలో పాచి పని చేసేవాళ్ళు, ఎన్ఆర్‌జిఎస్ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఎస్‌హెచ్‌జి స్వయం సహాయ సంఘాలు, అంగన్‌వాడీలు, లోడింగ్, అన్ లోడింగ్, కారాగారాలలో రూ.15వేల లోపు వేతనం పొందుతున్న వాళ్ళు, ఇఎస్ఐ, ఈపిఎఫ్‌లలో నమోదు కానివాళ్ళు ఈ పథకానికి అర్హులని తెలిపారు. వలస కార్మికుడు రేషన్‌కార్డు పొందాలంటే ముందుగా ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు.

## శివయ్య హుండీ ఆదాయం రూ.1.07కోట్లు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం ఆలయ ఇఓ కె వి సాగర్‌బాబు పర్యవేక్షణలో లెక్కించారు. లెక్కింపు ప్రక్రియను ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు. హుండీల ద్వారా రూ.1కోటి 7 లక్షల 26వేల 637లు వచ్చినట్లు ఆలయ ఇఓ కె వి సాగర్ బాబు తెలిపారు. అలాగే కొందరు భక్తులు మొక్కులు తీర్చుకొనుటకు బంగారు ఆభరణాలు హుండీల్లో సమర్పించే అలవాటు ఉంది. 000.035.000 బంగారు ఆభరణాలు వచ్చినట్లు తెలిపారు.వెండి నాగపడగల ద్వారా 348.600 కిలోలు, విదేశీ నగదు 67 నోట్లు వచ్చాయన్నారు. ఎయస్ఏ కరెన్సి 11, మలేషియా నోట్లు 46, ఇతర కరెన్సి 5 నోట్లు వచ్చాయి. 20రోజులకు హుండీల ఆదాయాలు గణనీయంగా వచ్చింది. అయితే ఈ నెల భక్తుల తాకిడి శని,ఆది, సోమవారాల్లో తప్ప మిగిలిన రోజుల్లో భక్తుల్లేక ఆలయం వెల వెల బోతుంది.

## మహిళా సంబంధిత ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదు

తిరుపతి క్రైం, అక్టోబర్ 11, ప్రభాతవార్త :

మహిళా సంబంధిత ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదని నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి అతిధి గృహం సమావేశ మందిరం నందు జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి ప్రతి పోలీస్ స్టేషన్ల వారీగా నమోదు అవుతున్న కేసుల స్థితిగతులను పిపిటి ద్వారా తెలుసుకుని సమీక్షించారు. అన్ని రకాల కేసులను త్వరితగతిన ఎలా పరిష్కరించాలనే మెలకువలను గురించి పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేసారు. కేసులు నమోదు చేస్తే సరిపోదని, శ్రద్ధ వహించి దర్యాప్తు చేయాలి, క్రైమ్ పోలీసులు ఇంకా మెరుగైన ఫలితాలను రాబట్టి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు అలా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని కారణాలను తెలుసుకుని సమగ్రమైన దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రౌడీ హిస్టరీ షీటర్లపై ఉన్న పిటి కేసులను ప్రాముఖ్యత కలిగిన కేసులుగా భావించి సంబంధించి ఎస్‌డిపిఓలు ప్రత్యేకంగా కోర్టుకు హాజరై న్యాయాధికారులతోమాట్లాడి కోర్టు విచారణ త్వరగా పూర్తిచేసి, సదరుషీటర్లకు శిక్ష పడేటట్లు కృషి చేయాలన్నారు. ఎన్‌డిపిఎస్ కేసులలో ప్రమేయం ఉన్న వినియోగదారులు, విక్రేతల ద్వారా సమాచారాన్ని సేకరించి వారి యొక్క నెట్వర్క్‌ను చేదించాలని, విద్యార్థులు ఎవరైనా ఈ వ్యవహారంలో అనుమానం ఉన్నట్లు సమాచారం ఉంటే వారికి తరచుగా కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో మంచి పరివర్తన వచ్చేటట్లు చర్యలు తీసుకోవడం ద్వారా ఒక మంచి జీవితాన్ని ఇచ్చిన వాళ్ళం అవుతామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పిలు పరిపాలన వెంకట్రావు, శాంతి భద్రత కులశేఖర్, నేర విభాగం విమల కుమారి, సెబ్ రాజేంద్ర, ఎస్బి డిఎస్పి గిరిధర్, జిల్లాలోని డిఎస్పిలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారిదొడ్డిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

శాంతిపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త



మండలంలోని చిన్నారిదొడ్డిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను జడ్పీటిసి శ్రీనివాసులు ప్రారంభించి ప్రసంగించారు. ప్రజల వద్దకు ఉచిత వైద్య సేవలు తెచ్చిన వ్యక్తి సిఎం జగనన్న అని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు నిసార్, పట్టాభి, చలపతి, వెంకటేష్, సుబ్రమణ్యం, వైద్యులు హరినాథ్, వంశీకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

## పక్కాగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన

పాలసముద్రం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు పక్కాగా సాధించడానికి కృషి చేయాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం పేదరికం నిర్మూలన, ఆహార భద్రత, ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపు, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మహిళా సాధికారిత, మంచినీటి సౌకర్యం తదితరాలను కల్పించే దిశగా చర్యలు తీసుకొంటుందన్నారు. ఈ సమావేశంలో ఎపిఓ మార్గరేట్, ఇఓఆర్డీ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక అధికారిగా సుబ్రమణ్యం

పెనుమూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

మండల ప్రత్యేక అధికారిగా డ్వామా ఎపిడి సుబ్రమణ్యంను నియమిస్తూ కలెక్టర్ సగిలి షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం మండల ప్రత్యేక అధికారికిగా ఎంపిడిఓ కార్యాలయంలో సుబ్రమణ్యం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి అధికారులు సహకరించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– ఎంపిపి హేమలతారెడ్డి

పెనుమూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేద ప్రజల సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఎంపిపి హేమలతా సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉగ్రాణంపల్లిలో సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి, జడ్పీటీసీ దొరస్వామియాదవ్, సింగిల్‌విండో ఛైర్మన్ గోవిందరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, వైకాపా కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పెనుమూరు విద్యార్థి

పెనుమూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న రెడ్డి ప్రసాద్ ఎంపికైనట్లు పాఠశాల హెడ్మాస్టర్ వెంకటేశులునాయుడు తెలిపారు. ఇటీవల రామకుప్పంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు రెడ్డి ప్రసాద్ ఎంపికయ్యాడని ఈ నెల 18, 19 తేదీల్లోఅన్నమయ్య జిల్లా కెవి పల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పవన్ పాల్గొంటాడని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పవన్ పట్ల పాఠశాల పిడి చంద్రశేఖర్ చౌదరి నాయుడులు అభినందించారు.

## వైసీపీ ప్రభుత్వం మిగిల్చించింది గోతులు మాత్రమే

టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి

వెదురుకుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త :

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు గోతులు మాత్రమే మిల్చిందని గోతులు మాత్రమేనని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి ఎన్. మునిచంద్రా రెడ్డి విమర్శించారు. విలేకర్లతో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసిన రోడ్లు గోతులమయమై నరకాన్ని తలపిస్తున్న ప్రభుత్వం మాత్రం ప్రతిపక్షాలకు గోతులు తీసే పనిలో మునిగిపోయిందని ఆరోపించారు. కక్ష సాధింపు కుట్ర రాజకీయలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి తుంగలో తొక్కి ప్రతిపక్షల గొంతు నొక్కి రాష్ట్రంలో నియంతృత్వ పోకడలతో రాష్ట్రంను సర్వనాశనం చేస్తుందని విమర్శాలు చేశారు. 20-20 విజన్‌తో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా 9 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా పనిచేసి 40 సవంత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి సంక్షేమము అభివృద్ధి కేర్‌ఆఫ్ అడ్రస్‌గా నిలిచిన చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ చేసి ప్రజాస్వామ్యానికి సంకెళ్ళు వేశారన్నారు. రాజ్యంగ వ్యవస్థను చిన్నభిన్నం చేస్తున్న జగన్ రెడ్డి పాలనకు చరమగీతం పాడటంకు ప్రజలు సిద్ధంగా ఉన్నార

## 13న అండర్ 17 బాల బాలిక కబడ్డీ జట్టు ఎంపిక

చౌడేపల్లి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 17 బాల, బాలికల కబడ్డీ జట్టును ఈనెల 13న ఎంపిక చేయనున్నట్లు స్థానిక ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామచంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు రాసేంద్ర కోరారు. విదార్థిణీ, విదార్థుల 2007జనవరి 1తర్వాత జన్మించి వుండి, 55కిలోల లోపు వుండాలన్నారు. టెన్త్, ఇంటర్‌లో మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తూ వున్నవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9652935524నంబరుకు సంప్రదించాలన్నారు.

## వైకాపా అరాచకాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం

మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త

అధికార వైకాపా అరాచకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మల్లానూరు పంచాయతీ దళితవాడలో బాబుతో నేను కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా చంద్రబాబును వైకాపా ప్రభుత్వం అరెస్ట్ చేయించిందని స్కిల్ స్కాంలో చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రజలు కూడా అన్నీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైకాపాను మట్టి కరిపించడం ఖాయమన్నారు. ఈసందర్భంగా ప్రజలకు కరపత్రాలు పంచారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీతి..నిజాయితీతో పనిచేస్తున్నాం..భయపడేది లేదు

తెలుగు మహిళ నేతలు

కుప్పంరూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త తాము తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కోసం నీతి,నిజాయితీతో కష్టపడి పార్టీ కోసం పనిచేస్తున్నామని వైకాపా నేతల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని తెలుగు మహిళలు పేర్కొన్నారు. బుధవారం కుప్పం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుకలు చీల్చుతాం అని మహిళలు అని కూడా చూడకుం డా వైకాపా నేతలు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కుప్పం విజయవాణి స్కూల్‌లో ఏం జరిగిందో ఆ స్కూల్ ఛైర్మన్‌కు మున్సిపల్ ఎన్నికల సమయంలో తెలియదా అని ప్రశ్నించారు. దొంగ ఓట్లతో కుప్పం మున్సి పాలిటీని గెలుచుకున్నారని పేర్కొన్నారు. తమిళనాడు నుంచి దొంగ ఓటర్లను రప్పించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ భరత్ పేరిట ఫేస్‌బుక్ ఖాతాను నడిపి తమపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన రెబల్ శివ అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయక తమపై వైకాపా నేతలు విమర్శలకు దిగడం సమంజసం కాదన్నారు. వైఎస్సార్సీ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, జిల్లా నేతలు సుగుణమ్మ, చంద్రకళ, కుప్పం మండలఅధ్యక్షురాలువసంతమ్మ,మున్సిపల్ అధ్యక్షురాలు శారదమ్మ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు



కుప్పంరూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం సదుమూరు హైస్కూల్‌లో జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రా ంత విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర పేరిట పెద్ద ఎత్తున క్రీడోత్సవాలు నిర్వహించడం జరుగుతు ందన్నారు. అంతకుముందు కొత్తపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జడ్పీఛైర్మన్ సందర్శించారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, వైస్ ఎంపిపి షౌకత్ అలీ, రాష్ట్ర నేతఈశ్వర్, స్థానిక నేతలు, సర్పంచులు కోడెప్ప, రమేష్, రెస్కో డైరెక్టర్ కుట్టి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష: జడ్పీటీసీ సుకుమార్



వెదురుకుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త : పేదల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జడ్పీటీసీ సభ్యులు చలం పాళ్యం సుకుమార్ పేర్కొన్నారు. మండలం లోని బ్రాహ్మణపల్లె సచివాలయం ఆవరణంలో బుధ వారం సర్పంచ్ బట్టే శీరీష చాణిక్య ప్రతాప్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమ అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు అవకా శంను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామంలో వైద్యాధికారులు పాల్గొని పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం కొరకు ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా తీసుకుని ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం వైద్యులు పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, రాష్ట్ర వైసీపీ బిసీ సెల్ నాయకులు బట్టే

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు నాణ్యమైన వైద్యం



–డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రభావతి

తవణంపల్లె, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలందరికి నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఓ.ప్రభావతి అన్నారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని తొడతర గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైద్యాధికారులకు పలు సూచనలు చేస్తూ రోగులకు కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు డాక్టర్ టి.ప్రియాంక, డాక్టర్ దాత్రేయ చౌదరి, టిఎస్.మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్, ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ సాయిరాం, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ హర్షిణి, డాక్టర్ అరుణశ్రీలు పలు రకాల వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలు చేయడంతో పాటు అర్హులైన వారిని ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, మండల వైకాపా కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, పట్నం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ రాధిక, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డి, మండల వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గంగవరం సిఐగా క్రిష్ణమోహన్

గంగవరం, అక్టోబర్ 11, ప్రభాతవార్త :



గంగవరం సిఐగా ఇ.క్రిష్ణమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ బి.అశోక్‌కుమార్ చిత్తూరు విఆర్‌కు వెళ్ళగా ఇ.క్రిష్ణమోహన్ చిత్తూరు విఆర్ నుండి గంగవరంకు వచ్చారు.ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ,ప్రోటోకాల్‌కు భంగం వాటిల్లకుండా,ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి,శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు.పోలీసులు ప్రజల మన్నలను పొందేలా అంకితభావంతో,చిత్తశుద్దితో విధులు నిర్వహించాలని ఆయన కోరారు.

## అందరికీ ఆరోగ్యం జగన్న లక్ష్యం : జడ్పీటీసీ దామోధర్‌రాజు

చారాల(చౌడేపల్లి), అక్టోబర్ 11 ప్రభాతవార్త

ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల లక్ష్యమని జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తిలన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం చారాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంత జీవితాన్ని గడపాలన్న ఆలోచన నుంచి ఉద్భవించిందే జగనన్న ఆరోగ్య సురక్ష అన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రతిష్టాత్మక పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన వారందరి ఇళ్ళవద్దకు అందించిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను ఆదరించాలని రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు, వైకాపా మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు అన్నారు. అనంతరం పలువురికి కళ్ళజోళ్ళను పంపిణీ చేసారు. సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణభరత్, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, మాజీ మండలాధ్యక్షులు శ్రీరామ్ రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరదా గోవిందయ్య, మండలంలోని సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

– కెడిసి ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్



కుప్పం, అక్టోబర్ 11 ప్రభాతవార్త

సమాజంలో బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కుప్పం డిగ్రీ కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలికతనలో ఉన్న ధైర్యం, త్యాగం, పట్టుదల, నిబద్ధతలను గుర్తు చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ విమల జోసెఫ్ మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాలికలు ముందుకు సాగాలన్నారు.ఈసందర్భంగా బాలికలకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, కోఆర్డినేటర్ ఆశ, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలి

కమిషనర్ వెంకటరామయ్య



వెంకటగిరి, అక్టోబర్ 11, ప్రభాతవార్త:

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరిం చాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య కోరారు. బుధవారం ఆయన క్రాస్‌రోడ్‌లో ఉన్న దుకాణాలను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వీధుల్లో చెత్తాచెదా రాలు వేయరాదని సూచించారు. మురికినీరు వీధుల్లో పోయ కూడదని తెలిపారు. అందరూ సహకరిస్తే పట్టణాన్ని పరి శుభ్రంగా ఉంచవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దుకాణాల్లో కూడా పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన తెల్లవారుజామున పరిశీలించారు. అన్ని వీధుల్లో శుభ్రపరచాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## నేటి నుండి నేదురుమల్లి మేలుకొలుపు కార్యక్రమం

– అక్కడికక్కడే సమస్యల పరిష్కారం



వెంకటగిరి, అక్టోబర్ 11, ప్రభాతవార్త:

పోలేరమ్మ జాతర వైసీపీ పార్టీ మీటింగు కార్యక్రమాల వలన ఆగిన వెంకటగిరి మేలుకొలుపు కార్యక్రమాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం నుండి తిరిగి ప్రారంభిస్తారు. పట్టణంలోని బంగారుపేట 1, 2 వార్డులలో సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి రామ్‌కుమార్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారు. ఉదయం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు ఇంటింటికి వెళ్లి ఆయన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. మేలుకొలుపు కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన లభించింది. ఇంటి వద్ద సమస్యలు పరిష్కారమవుతున్నాయని స్థానికులు హర్షిస్తున్నారు.

## ఈ తరం విద్యార్థులు వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టాలి

– కెవికె అధిపతి డాక్టర్ బి.జి.రాజులు



వెంకటగిరి, అక్టోబర్ 11, ప్రభాతవార్త:

ఈ తరం విద్యార్థులు వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బి.జి.రా జులు తెలిపారు. నాయుడుపేట మండలం ఆరిమేనుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నత చదువులు చదివినా వ్యవసాయాన్ని వదలకూడదని సూచించారు. సెలవుల్లో వ్యవసాయ పనులు చూసుకోవాలని తెలిపారు. నిమ్మ, జామ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్‌లు, పెరటి కోళ్ళ పెంపకం, కృత్రిమ కోడిగుడ్ల యంత్రంపై కూడా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్, తిరుపాలు, నాగార్జునరెడ్డి, రాజీవ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటకే వైద్య సేవలు

– తహశీల్దార్ పద్మావతి



కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త

ప్రభుత్వం పేదల కోసం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని కోట మండల తహశీల్దార్ పద్మావతి అన్నారు. బుధవారం కోట మండలం కేశవరంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గురుస్వామి అధ్యక్షతన ముఖ్య అతిథిగా తహశీల్దార్ పద్మావతి హాజరయ్యారు. సచివాలయ పరిధిలోని వైద్య సిబ్బంది 15 రోజుల పాటు ఆరోగ్య సర్వేలు, బిపి, షుగర్, టెంపరేచర్, పల్స్, ఫీవర్ సర్వేలు నిర్వహించారు. అటువంటి వారికి స్లిప్‌లు ఇచ్చి ఉచితంగా వైద్య సేవలు చేస్తారని తెలిపారు. అనంతరం చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, సర్పంచ్ గురుస్వామి మాట్లాడుతూ దేశ చరిత్రలో రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ ఆరోగ్యకరమైన జీవితం వైపు చేయిపట్టుకొని నడిపిస్తోందని అన్నారు. గతంలో ఎన్నడూ తీరుకురాని వైద్య కళాశాలలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెట్టింపు వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలు అందించేందుకు విలేజ్ క్లినిక్‌లు, రోగుల వద్దకే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు సుబ్బన్న, రఘురామయ్య, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘనసన్మానం

కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త



ఏ వృత్తిలో అయినా ఉద్యోగులు బదిలీ కావడం సహజమని, అయితే పనిచేసిన చోట ప్రజల ఆదరాభిమానాలు పొందాలని కోట ఎంఇఓ మస్తానయ్య అన్నారు. బుధవారం గోవిందపల్లి గ్రామంలోని పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం మాజీ జడ్పీటిసి సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో పవిత్రమైన వృత్తి ఉందంటే అది ఉపాధ్యాయులే అని చెప్పారు. అన్ని రంగాల్లో భావిభారత పౌరులను తీర్చిదిద్దేది గురువులే అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ తిరుపాలయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తంబిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి సేవలు మరువలేం

కోట, అక్టోబర్ 11 ప్రభాతవార్త



ఆర్ఎస్ఎస్ నేత, దివంగత తంబిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని గూడూరు నియోజకవర్గం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఎంబేటి చెంగల్‌రావు అన్నారు. బుధవారం గోవిందపల్లి గ్రామంలో తంబిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి దశదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి చెంగల్‌రావు పూలమాల వేసి నివాళి అర్పించారు. తీరప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు చేసిన మహనీయుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య, కృష్ణయ్య, రహంతుల్లా, వెంకటరమణయ్య, అంకబాబు, కోటేశ్వరరావు, గోపాలయ్య, మస్తానయ్య, సుమన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## కారూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

తడ, అక్టోబర్ 11 ప్రభాతవార్త



తడ మండలం కారూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కారూరులో తహశీల్దార్ కటారి జయజయరావు ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ ఆమోస్‌బాబు, ఎంపిపి కొళవి రఘురెడ్డి, స్థానిక సర్పంచ్ నిత్య, జెసిఎస్ కన్వీనర్ సుందరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 418 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కంటి వెలుగు పథకం ద్వారా కళ్లద్దాలు ఇచ్చారు. రామాపురం, తడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు జయశ్రీదేవి, కిషోర్‌కుమార్, తిరుపతి నుంచి వచ్చిన డాక్టర్లు పల్లవి, మధు, రామాపురం పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎంఇఓ కార్యాలయ ఉద్యోగి మృతి

తడ, అక్టోబర్ 11 ప్రభాతవార్త

తడ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మెసెంజర్‌గా పనిచేస్తున్న చిరివేటి చంద్రబాబు మృతిచెందారు. అనారోగ్య కారణాలతో చిన్న వయస్సులోనే చంద్రబాబు మరణించడంతో అతని స్వగ్రామం వాటంబేడులో విషాదఛాయలు అలముకున్నాయి. బుధవారం తడ మండలం వాటంబేడుకు తహశీల్దార్ కటారి జయజయరావు తమ సిబ్బందితో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## సూళ్లూరుపేటలో మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు వద్ద భారీ కేక్ ఏర్పాటు చేసి కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే పట్టణ వైసీపీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అలవల సురేష్, జెట్టి వేణుయాదవ్, చిన్ని సత్యనారాయణ, మీజూరు రామకృష్ణారెడ్డి, ఎ.దొరబాబురెడ్డి, చిలకా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

గూడూరు, అక్టోబర్ 11, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతగా బెల్లంకొండ సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బెల్లంకొండ సురేష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి అని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, రాము, కోట వెంకటేశ్వర్లు, కుమార్ నాయుడు, వెంకట కృష్ణయ్య, శ్రీనివాసులు, కార్యనిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైసిపి నేత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

గూడూరు, అక్టోబర్ 11, ప్రభాతవార్త



వైఎస్ రాజశేఖర్ రెడ్డి పై అభిమానంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్ర నుండి జగన్ వెన్నంటే నడిచిన వైసిపి నాయకుడు ఊటుకూరు మహేందర్ రెడ్డి అని వైసిపి సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు జడ్పిటిసి యామిని భర్త ఊటుకూరు మహేందర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి నవరాత్రుల మహోత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

చిల్లకూరు, అక్టోబర్ 11, ప్రభాతవార్త



కలవకొండ గ్రామంలో కొండ పై వెలసి వున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఆరవ వార్షికోత్సవ సరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను ఆలయ ఛైర్మన్ కందల ఆనంద్ చేతులు మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేది నుంచి 24వ తేది వరకు జరిగే దేవీ సరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నామని 9 రోజులు పాటు ఉభయకర్తల సహకారంతో స్వామి, అమ్మవార్లను వివిధ రకాల వాహనాలలో కొలువు దీర్చి మాడా వీధుల్లో ఊరేగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఏఎంసి ఛైర్మన్, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, ముత్యాలమ్మ ఆలయం నిర్మాణాలకు ప్రధాతగా వ్యవహరించిన యరటపల్లి జానకీరామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ కె. నవీన్ కుమార్, కమిటీ సభ్యులు దొంత వెంకటేశ్వర్లు, ఉడత సుబ్రమణ్యం, మారుబోయిన రామచంద్రయ్య, అన్నిశెట్టి సుగుణమ్మ, బూదూరు అచ్చెమ్మ, బూదూరు కోటమ్మ, అర్చకులు విజయగోపాల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

– రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరం జరుగుతుందని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇవిఎంల యాక్సెప్టెన్సీ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించి అవసరమైన ఇవిఎంలు రావడం జరిగిందని, వీటిని బెల్ ఇంజనీర్లు పరిశీలిస్తున్నారన్నారు. ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ అధికారులకు త్వరలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, ట్రైనీడిప్యూటీకలెక్టర్ లక్ష్మీ ప్రసన్న, వైకాపా, తెలుగుదేశం సిపిఐ, సిపిఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నోడల్ హెడ్మాస్టర్‌గా మనోహర్‌నాయుడు

పాలసముద్రం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:

పాలసముద్రం మండల నోడల్ హెడ్మాస్టర్‌గా ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు నియమితులయ్యారు. నోడల్ హెడ్మాస్టర్‌గా నియమితులైన మనోహర్‌నాయుడు బుధవారం ఆముదాల జడ్పీ ఉన్నత పాఠశాల, తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, పాఠశాలల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలతో హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయుడు జయప్రకాష్‌రెడ్డి, హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిమ్స్ హాస్పిటల్లో సెక్యూరిటీ సిబ్బంది వాహనాలకు గాలి తీస్తున్న వైనం

లబోదిబోమంటున్న మహిళ వాహనదారులు



**తిరుపతి టౌన్, అక్టోబర్ 11, ప్రభాతవార్త**

సిమ్స్ హాస్పిటల్లో సెక్యూరిటీ సిబ్బంది వాహనాలకు గాలి తీస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మహిళా వాహనదారులు లబోదిబోమంటున్నారు. నో పార్కింగ్ బోర్డు అయినా పెట్టాలని తమకు ఎలా తెలుస్తుంది నో పార్కింగ్ ఏరియా అని ప్రశ్నించగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది నో పార్కింగ్ బోర్డు లేదు, సెక్యూరిటీ సిబ్బంది లేరు ఎవరికైనా చెప్పుకోండి అని సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన వాళ్ల చనిపోయిన బాధలో వారు ఉంటే ఇలా చేయడం సరికాదని వాహనదారులు అంటున్నారు. మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా పార్కింగ్ బోర్డు లేనప్పటికీ వాహనాలను సెక్యూరిటీ సిబ్బంది పంచర్ చేస్తున్నారన్నారు. తమ వాహనాలలో గాలి ఎందుకు తీస్తున్నారని అడిగితే వారిని టిటిడి సెక్యూరిటీ సిబ్బంది బెదిరిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు.

## టిటిడిలో తిరుపతి ఒక భాగమే

తితిదే ఆదాయం తిరుపతికి వెచ్చించడం న్యాయమే వైసిపి ప్రజా ప్రతినిధులు వెల్లడి



**తిరుపతి టౌన్, అక్టోబర్ 11, ప్రభాతవార్త**

తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక ఆదాయంలో ఒక శాతం టిటిడిలో ప్రధాన భాగమైన తిరుపతి నగరానికి వినియోగించడంలో న్యాయం ఉందని వైకాపా కార్పొరేటర్లు తిరుపతి టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు వెల్లడించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ శ్రీ వారి దర్శనానికి తిరుమలకు విచ్చేయు భక్తులు ముందుగా తిరుపతి నగరంలో అడుగు పెడతారని తద్వారా వెంకన్న కోసం నలుదిశల నుండి విచ్చేయు యాత్రికులకు తిరుపతి మున్సిపాలిటీ ఎనలేని సేవలు చేస్తున్నదని ఇది భారతీయ జనతా పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని తెలిపారు. బిజెపి నాయకులు హిందువుల ముసుగులో నీచ రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సునీత స్టోన్ బ్యాగ్ డైరెక్టర్లు అనిల్ రాయల్, మబ్బు నాగమణి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత మేలుకో

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను సిఎంను చేద్దాం, జనసేన పార్టీ పిలుపు



**తిరుపతి టౌన్, అక్టోబర్ 11, ప్రభాతవార్త**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి యువత నడుం బిగించి వారి ఓటును నమోదు చేసుకుని, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి తద్వారా దోపిడి ప్రభుత్వ పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడాలని జనసేన పార్టీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు మేల్కొని రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఓటు వేసి జనం పక్షం ఉండే జనసేన పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా సీట్లను గెలిపించి జనసేనాని ముఖ్యమంత్రి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన నేతలు రాజా రెడ్డి, బత్తిన మధుబాబు, గుట్ట నాగరాజు రాయల్, కొండా రాజమోహన్, మునుస్వామి, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోలా ఆనంద్‌ను సత్కరించిన బిజెపి కొత్తనాయకులు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

తిరుపతి జిల్లాలో బిజెపి నూతన కార్యవర్గం కూర్పులో రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ దిశె దెశ నిర్దేశం చేస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయటానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. నేడు ప్రపంచ దృష్టిలో భారత ప్రధాని నరేంద్రమోదీ మీద ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో భారత దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఘనత నరేంద్రమోదీదే అన్నారు. విభజన ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పరచుటకు అన్ని సహకరిస్తున్నారని వివరించారు. పుణ్యక్షేత్రాల అభివృద్ధికి బిజెపి కట్టుబడి పని చేస్తుందన్నారు., అయితే కేంద్ర ఇచ్చే పథకాలను అమలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కొత్తకార్యవర్గంలో ఉత్సాహ వంతులున్నారు. ప్రతి ఒక్కరు జవాబుదారి తనంతో వ్యవహరించాలన్నారు. శ్రీకాళహస్తి నుంచి జిల్లా కార్యవర్గంలో మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులుగా బిడి బాలాజిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా సభ్యులు కొండేటి గోపాల్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించటంలో తాము కృషి చేసామని తమ నమ్మకాన్ని వమ్ము చేయక పని చేయాలని కోలా ఆనంద్ హితవు పలికారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గం కోలా ఆనంద్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

## ప్రతిపక్షాల ఓట్లు తొలగింపుపై ఫిర్యాదు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతిపక్షాల మద్దతుదారుల ఓట్లను తొలగింపుపై జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి సారధ్యంలో ఆ పార్టీ కార్యకర్తలు బుధవారం శ్రీకాళహస్తి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు ఈ ప్రక్రియను గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నట్లు అందుకు అధికారులు వత్తాసు పలుకుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వినూత తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసారు. అధికారులు నిష్పక్షపాతంగా దొంగ ఓట్లకు, ప్రతిపక్ష పార్టీల మద్దతు దారుల ఓట్ల తొలగింపుకు సంబంధించి బూత్ స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు దండి రాఘవయ్య, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కొప్పల గోపి, శ్రీకాళహస్తి పట్టణ ఉపాధ్యక్షుడు తోట గణేష్, ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి. తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి పేట చంద్రశేఖర్ నాయకులు గురవయ్య, బొక్కసం రాజశేఖర్, కిషోర్ వెంకటేష్ తదితరులు హాజరై తహశీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.

## అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమసంపాదను కాపాడుకుంటున్న జగన్‌రెడ్డి



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించిన అక్రమ సంపాదనను కాపాడుకోవడానికి తన కుటుంబసభ్యుల రక్త చరిత్రను తుడిచేయడానికే తప్ప తనను ముఖ్యమంత్రి పీఠం ఎక్కించి ప్రజలకు ఒక్క మేలు కూడా చేయని జగన్‌రెడ్డి వద్దేవద్దు అని రాష్ట్ర ప్రజానీకం ముక్తకంఠంతో ఘోషిస్తున్నారని తెలుగుదేశంపార్టీ వన్నెకులక్షత్రియ సాధికార రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, ౖతెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు ఆరోపించారు. వీరు మాట్లాడుతూ చిన్నాన్న, చెల్లికి వెన్నుపోటు, అమ్మరాజీనామా ఉదంతం, దిశ లేని దిశాచట్టం గన్నుకన్నా ముందు వస్తానని రాలేదు. క్యూలైన్లో రేషన్ పథకం వంటి పనికిమాలిన పనులు కావాల్సినంత చేసిన జగనన్న మాకు ఇంకోసారి వద్దు అని రాష్ట్ర పౌరసమాజం తీర్మానించుకుందని తెలుగుదేశంపార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సాధికార కమిటీ సభ్యులు మిన్నల్‌రవి, పట్టణ సహకార మాజీ ఛైర్మన్ డివినారాయణ, మాజీ వైస్ ఛైర్మన్ ఖాదర్‌బాషా, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు, బిసి విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, తిరుపతి పార్లమెంటు నాయకలు బీమాల భాస్కర్, మణి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గంగాదేవికి ప్రత్యేక పూజలు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చెర విముక్తి కలగాలని కోరుతూ బుధవారం తెలుగుదేశంపార్టీ శ్రేణులు స్థానిక జయరాంరావువీధిలో వెలసిన జగజ్జననీ గంగాదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరదాచారి, వన్నెకులక్షత్రియ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మన్ డివి. నారాయణ, మాజీ వైస్ ఛైర్మన్ ఖాదర్‌బాషా, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు, బిసి విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాల భాస్కర్, చిల్లకూరు మణి, పూలశేఖర్, చెంబేటి బాలయ్య, గంగనపల్లి రమేష్‌బాబు, డి. శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో కార్యాలయ సేవకుడి మృతికి సంతాపం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

అందరివాడు, సౌమ్యుడుగా మంచితనంతో పలకరించే వాడు ఎంతపని ఉన్నా విశ్రమించక శ్రమించే వాడు చంద్రుడు వలె చిరునవ్వుతో ఉండే వాడు తడ విద్యాశాఖ కార్యాలయంలో మెసెంజర్‌గా పనిచేస్తున్న యస్. చంద్రబాబు గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమని శ్రీకాళహస్తి ఎంఈవో కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఆత్మకు శాంతికలగాని కోరుతూ చంద్రబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎంఈవో కార్యాలయ సిబ్బంది కెవి. ప్రశాంత్, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

**తొట్టంబేడు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిలకావారికండ్రిగలో విద్యాసామగ్రి వితరణ కార్యక్రమంను సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ ఆధ్వర్యంలో సుమారు రూ. 6వేల రూపాయలు విలువచేసే విద్యాసామగ్రిని విద్యార్థినీ విద్యార్థులకు వితరణ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి భాస్కర్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రావు, సుకన్య ఎస్ సంస్థ కోశాధికారి నారాయణ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, విద్యాశాఖ సిఎంఆర్‌టి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులకు (బాలికల జూనియర్ కళాశాల) యూనిఫాంలను లోకా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సునీల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన యూనిఫాం విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటూ వారిలో విశ్వాసం పెంపొందడంలో ప్రేరణగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇది క్రమశిక్షణకు స్ఫూర్తి దాయకంగా ఉంటుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో విజేతలుగా నిలవడానికి వారి ఉజ్వల భవిష్యత్‌కు మంచి విలువలతో పాటు కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం లోకా ఫౌండేషన్ సంస్థ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కె. రమణయ్య, టీచర్లు సురేష్, కిషోర్, పీడీ తదితరులు పాల్గొన్నారు.

## దళితులను దగా చేసిన జగన్ ప్రభుత్వం

టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్



**చంద్రగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

ఒక్క ఛాన్స్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దళితులను దగా చేసిందని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ విమర్శించారు. మండల పరిధిలోని కొటాల దళితవాడలో బుధవారం ఆయన "బాబుతో నేను" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి దళితులపై దౌర్జన్యాలు, భౌతిక దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. దళితుల హక్కులను కాలరాస్తూ అణచివేతకు పాల్పడుతున్నట్లు విమర్శించారు. దళితులకు న్యాయం జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అధికారం వుందని కక్షపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేసినట్లు ఆరోపించారు. త్వరలోనే ఇందుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## తెలుగుదేశం పార్టీ అత్యంత ఆప్తుడిని కోల్పోయింది..!

టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని కంటతడి



**రామచంద్రాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ అత్యంత ఆప్తుడిని కొల్పోయిందని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని కంటతడి పెట్టుకున్నారు. బుధవారం బొప్పరాజు పల్లిలో మహ్మద్ రఫీ మృతదేహానికి పూలమాల వేసి ఘననివాళుల ర్పించారు. రఫీ పాడిమోసిన ఆయన కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామ ప్రజలు రఫీకి సానుభూతి తెలపడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. రఫీ కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించి ముగ్గురు పిల్లలకు ఉచిత విద్యను అందజేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజల ఆరోగ్యం కోసమే "జగనన్న ఆరోగ్య సురక్ష"

ఎంపిటిసి మంజుల సిద్దారెడ్డి



**రామచంద్రాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

ప్రజలందరూ ఆరోగ్యంగా వుండటం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిటిసి మంజుల సిద్దారెడ్డి అన్నారు. బుధవారం సికె పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు యశ్వంత్ రెడ్డి, గజేంద్ర, వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నడవలూరు గ్రామ ప్రజల ఆప్యాయత మరువలేనిది..!

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



**రామచంద్రాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

నడవలూరు గ్రామ ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్ల చూపుతున్న ఆప్యాయత మరువలేనిదని పార్టీ యువజన నాయ కుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. బుధవారం నడవలూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ గణపతి రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలో ప్రజలు ఆయనకు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి వివరించారు. మా అన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని 2024 ఎన్నికలలో ఎంఎల్ఏగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎవి. బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ గణపతి నాయుడు, డివిజన్ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రారెడ్డి, వైసిపి నాయకులు యోగానందరెడ్డి, గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య సంరక్షణకు జగనన్న సురక్ష కార్యక్రమం

: ఎంపిపి పి దివాకర్‌రెడ్డి

**నారాయణవనం, అక్టోబర్ 11 ప్రభాతవార్త :**

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మాజీ నెడ్ క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, డాక్టర్ దరి శ్రీరాజ్‌లు తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని సచివాలయం-3 పరిధిలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, పంచాయతీ ఇఓ టిపి షణ్ముగం, కార్యదర్శిసరిత, ఐసిడిఎస్‌సూపర్‌వైజర్‌బేబి, వైద్యసిబ్బంది, సచివాలయంఉద్యోగులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు నైస్ విద్యార్థి ఎంపిక

**వరదయ్యపాలెం, అక్టోబర్ 11, ప్రభాతవార్త**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి అండర్ 14 కరాటే పోటీలకు నైస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి హేమసుందరం ఎంపికైయ్యాడు. ఎంపికైన విద్యార్థిని నైస్ స్కూల్ కరస్పాండెంట్ ఎం. మోహన్ శాలవా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మోహన్ మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 8 నుండి 11 తేది వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు తమ విద్యార్థి వంకన్ గటకన్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో విశేష ప్రతిభ కనబరచిన ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యాడు. ఇంకా మరెన్నో విజయాలు సాధించి, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థిని , కరాటే మాస్టర్ కన్నయ్యని ఆశీర్వదించారు. ఈ హెచ్‌ఎంకె దాశరథి, ఉపాధ్యాయ బృందం, కరాటే మాస్టర్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో పడకేసిన పారిశుధ్యం



**తిరుపతిరూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:**

తిరుపతిరూరల్ తుమ్మలగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లి స్మశానవాటికలో పారిశుధ్యం పూర్తిస్థాయిలో పడకేసింది. ప్రముఖులు రాకపోకలు సాగించే వి.ఐ.పి రోడ్డు అనుకుని ఉన్న స్మశానవాటికలో మురుగునీరు స్తంభించి ఉండటంతో మురుగు దుర్వాసన వెదజల్లుతుంది. స్వయాన ఎమ్మెల్యే స్వంత పంచాయతీలో పారిశుధ్యం తిష్టవేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్మశానవాటిక సమీపంలో ఉన్న నివాసితులు దుర్గంధ దుర్వాసన భరించలేక అల్లాడిపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి స్పందించి పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని ఉప్పరపల్లి వాసులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే సారూ....!

మా దారి కష్టాలు చూడండి -విద్యార్థులు, రైతులు వేడుకోలు



**సత్యవేడు, అక్టోబర్ 11, ప్రభాతవార్త :**

ఎమ్మెల్యే ఆదిమూలం సారూ.. ఒక్కసారి సత్యవేడు, బాలక్రిష్ణాపురం వయా సత్యవేడు శివాలయం రోడ్డును పరిశీలించండి. నాలుగేళ్ళకు పైగా ఈరోడ్డుకు మరమ్మత్తులు లేవు. నాలుగు దేవాలయాలు, ఒక ఫౌరసరఫరా గిడ్డంగి సముదాయం, నియోజకవర్గ స్థాయి క్రీడామైదానం, ఓప్రయివేట్ డిగ్రీ కళాశాల ఈ దారి వెంబడి ఉన్నాయి. గుంతల మయంగా మారిన ఈరోడ్డుకు తట్టమట్టివేసే దిక్కులేకపోవడంతో ఇటు వైపుగా రాకపోకలు జరుపలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. ఇలాంటి రోడ్డులు మండలంలో చాలానే ఉన్నాయి. వాటిని పట్టించుకోక కొందరు ప్రజా ప్రతినిధులు తమిళనాడుకు రోజుకు వేల టన్నుల్లో గులకమన్ను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి పరిస్థితులను అర్థంచేసుకుని ఒక్కసారి ఈరోడ్డును సందర్శించి మా దారిని దారిద్ర్యపుకష్టాలనుంచిబయటపడేయాలనివిద్యార్థులు, రైతులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను వేడుకుంటున్నారు.

## 16న నైపుణ్య అభివృద్ధి శిక్షణ సంస్థల ఆధునీకరణ



**సత్యవేడు, అక్టోబర్ 11, ప్రభాతవార్త :**

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 16న నైపుణ్య అభివృద్ధి శిక్షణ సంస్థల ఆధునీకరణకు శ్రీకారం చుట్టినట్లు ప్రిన్సిపాల్ ఉషాదేవి ఒప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆయా పరిశ్రమల ఉత్పత్తులకు తగ్గట్టుగా శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థవారు సంకల్పించినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం, సాంకేతిక విద్యాసంస్థల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యంతో శిక్షణకు సంబంధించిన ఒప్పధం కుదుర్చుకుంటుందన్నారు.

# తిరుపతి డివిజన్

## బాలికలను ప్రోత్సహిస్తే విజయాలు సాధిస్తారు

ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వీరయ్య

**పుత్తూరు, అక్టోబరు 11 ప్రభాతవార్త :** యుక్త వయస్సులోనే బాలికలకు సమర్ధంగా ప్రోత్సహిస్తే వారు భవిష్యత్‌లో ప్రపంచాన్ని మార్చే సామర్థ్యాన్ని పెంపొందించుకోగలరని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వి. వీరయ్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కాలేజీ మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విద్యార్థినులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న వయస్సులోనే బాలికల ఆశలు, ఆశయాలను చిదిమేయకూడదని, బాలికలు ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించాలని తెలిపారు. బాలికలు అభివృద్ధి చెందడానికి, అన్ని రంగాల్లో ముందంజలో వుండేందుకు స్ఫూర్తిని ఇవ్వాలనే తలంపుతో ఐక్యరాజ్యసమితి 2012 అక్టోబరు 11వ తేదీ నుంచి ప్రతి సంవత్సరం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని వివరించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనరర్ డాక్టర్ కందేరి శ్రీదేవి మాట్లాడుతూ బాలికల, మహిళల హక్కులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ ఎస్. పద్మావతి, డాక్టర్ షర్మిల, డాక్టర్ కుమార శ్రీదేవి, సావిత్రి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు క్షేమంగా బయటకు రావాలని పూజలు

**నగరి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** నగరి మున్సిపాలిటీ బేరివీధిలో ఉన్న వినాయక ఆలయంలో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యం, అక్రమ అరెస్టు నుంచి నిర్ధోషిగా బయటికి రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జి. రమేష్‌బాబు, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, గుణశేఖర్‌నాయుడు, జ్యోతినాయుడు, రొక్కం బాలాజీ, ఖాదిర్‌బాయ్, రమేష్‌రెడ్డి, నాగరాజు, చిట్టి, ఆకులఅశోక్, కరకంతాపురం అశోక్, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి ప్రశంస



**నగరి, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహించిన అంతరరాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి పోటీలకు ఎంపికైన వశిష్ట విద్యాలయ 10వ తరగతి విద్యార్థి తేజేష్‌ను పాఠశాల కరస్పాండెంట్ రాజరాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు జయచంద్ర బుధవారం అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలంటూ ఆకాంక్షించారు. పీఈటీ సతీష్ మాట్లాడుతూ తేజేష్ బాల్ బ్యాడ్మింటన్‌లో రెండో సారి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు గీత, విజయ పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డిని ఓడించడం అసంభవం - ఎమ్మెల్యే



**రేణిగుంట, అక్టోబరు 11 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఓడించడం ఎవరి తరం కాదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే రేణిగుంట పంచాయతీలో జ్యోతినగర్, అన్నైనగర్‌లలో సర్పంచ్ నాగేషం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను గురించి తెలియజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా వైసీపీతో ఉన్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి ప్రజలకు తెలుసనన్నారు. ప్రజా బలంతో వైసీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, రేణిగుంట మండల వైసీపీ అధ్యక్షుడు డా. గంగారి రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట తిరుపతి జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్ రసూల్, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, మండల వైసీపీ మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, వైసీపీ పట్టణ మైనారిటీ అధ్యక్షుడు రఫీ ఉల్లా, షబ్బీర్ అహ్మద్, ఇరానీ ఖాదిర్, యువజన నేతలు ఎంజీ రెడ్డి, సందీప్‌రెడ్డి, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, ఎంఎంటీసీ జువ్వల ధనంజయరెడ్డి, తారక రామానగర్ వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసు లురెడ్డి(ఎంఎస్ఆర్), గురవరాజుపల్లి రహీం, జిల్లావైసీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, మహిళా నాయకులు అరుణదేవి, ఈశ్వరి, బుజ్జమ్మ, వార్డుమెంబర్లురమణ, ఉప్పు రమణ, షఫీ ఉల్లా, ఇంద్రనాథన్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అమరలో ఆర్థోఫెటిక్ సర్జన్ అందుబాటు

**రేణిగుంట, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆస్పత్రిలో ఆర్థోఫెడిక్ వైద్య సేవలను అందించడానికి ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్ డా. రామ్‌చిదంబరం సీనియర్ షోల్డర్, ఎల్బో, హ్యాండ్ స్పెషలిస్టు సర్జన్ అక్టోబరు 14 శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమర ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారు. భుజనం, మోచేయి, మణికట్టు, చేతికి సంబంధిత సమస్యలు ఆర్థోస్కోపీ సమస్యలు ఉన్న వారు అమర ఆస్పత్రిలో 7993933777 మొబైల్ నెంబర్‌కు సంప్రదించవచ్చునని సీఏవో వేణుగోపాల్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## సామాన్యులకు వరం జగనన్న సురక్ష



**వడమాలపేట, అక్టోబరు 11 ప్రభాతవార్త:** జగనన్న సురక్ష పథకం సామాన్యులకు వరమని మాజీజడ్పీటీసీ సురేష్‌రాజు అన్నారు. బుధవారం వడమాల సచివాలయ పరిధిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో తేవడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పది మందికి కంటి అద్దాలు, ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన హెల్త్ కార్డులు 72 మందికి అందజేశారు. బుధవారం 283 సాధారణ చికిత్సలు, ప్రత్యేక వైద్య నిపుణులు 106 మందిని పరీక్షించి అందులో 11 మందిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి పంపించడం జరిగింది. షుగర్‌పరీక్షలు 215 మందికి చేశారు. గర్భవతులు, బాలింతలు 68 మంది, కంటి వ్యాధి గ్రస్తులు 70 పరీక్షించి అందులో 9 మందిని ఆపరేషన్ నిమిత్తం తిరుపతి అరవింద ఆస్పత్రికి పంపడం జరిగింది. రుయా వైద్యులు సురేష్‌బాబు, సుజాత, వంశీప్రియ, జీవన్‌రావ్, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు చక్రపాణి, సీహెచ్‌వోపురుషోత్తంరెడ్డి, మంజుల, పద్మకుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సర్పంచ్‌లు అంజమ్మ, శ్రీవిద్య, మునెమ్మ, వైసీపీ నాయకులు ఉమాపతి, నందయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి



**పుత్తూరురూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

రామకృష్ణాపురం పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టు కింద భూముల రీ సర్వే ప్రారంభమవుతుందని రైతులు సహకరించాలని తహసీల్దార్ పరమేశ్వరస్వామి తెలిపారు. బుధవారం రామకృష్ణాపురం పంచాయతీలో ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది పర్యటించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సర్పంచ్ విరిత ఆధ్వర్యంలో జరిగిన ఆయన మాట్లాడుతూ వందేళ్ళకు తరువాత చేపడుతున్న భూముల రీ సర్వేకు సహకరించడం వల్ల సర్వే ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తవుతుందని రైతులకి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముని నరేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం పంచాయతీలో జగనన్న శాశ్వత భు హక్కు పథకం(భూ రీ సర్వే) గురించి గ్రామ సభ సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో జరిగింది. జగనన్న శాశ్వత భు హక్కు పథకం గురించి గ్రామ ప్రజలకు, రైతులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. హరిత, మండల సర్వేయర్ శేషంరాజు, వీఆర్‌వో ఫిరోజ్ పాల్గొన్నారు.

## జీఈఆర్ సర్వేని వంద శాతం వేగవంతం చేయాలి



**పుత్తూరురూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:**

పుత్తూరు విద్యాశాఖ పరిధిలో అందరూ చదవాలని 5 నుంచి 18 సంవత్సరాల వరకు అందరూ చదువుకోవాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డా. శేఖర్ తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ బిల్డింగ్‌లో వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వలంటీర్లు వంద శాతం జీఈఆర్ సర్వేనఇ పూర్తిచేయాలని తెలిపారు. ఈ సర్వేలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని ఆదేశించారు. అదే విధంగా ప్రతి పిల్లవాడు చైల్డ్ ఇన్ఫోలో ఉండాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో వెళ్లిన వారు, చదువుతున్న వారు మరణించిన వారు వీరిని అందరిని వలంటీరు యాప్‌లో తొలగించాలన్నారు. ఈ సర్వే రెండు రోజుల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, మున్సిపల్ కమిషనర్ కె. ఎల్. ఎన్. రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, సీఆర్పీలు, ఎంఐఎస్‌లు పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్షతతో అందరికి ఆరోగ్యం - ఎంపీటీసీ



**పిచ్చాటూరు, అక్టోబరు 11 ప్రభాతవార్త:** ఆరోగ్య సురక్షతతో ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీటీసీ రమేష్‌రాజు తెలిపారు. బుధవారం మండలంలోని పులికుండ్రంలో ఆరోగ్యసురక్ష కార్యక్రమం జరిగింది. 150 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసి రేషన్ కార్డు దారులకు ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన కార్డు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

